క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని భద్రగిరి ఆర్ఐటీఐలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెన్త్ క్లాస్‌లో ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు అర్హులన్నారు. తమ ఐటీఐ వద్ద ఎలక్ట్రీషియన్ 20 సీట్లు, వెల్డర్ 40 సీట్లు, ఫిట్టర్ 20 సీట్లు, ఎలక్ట్రానిక్స్ 24 సీట్లు, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్ 24 సీట్లు, కోపా 48 సీట్లు, డ్రెస్ మేకింగ్ 48 సీట్లను ఈ విద్యా సంవత్సరంలో భర్తీ చేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు జూన్ 6వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా (డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్) దరఖాస్తు చేసుకోవాలన్నారు. మొదటి కౌన్సెలింగ్‌ను సాలూరు ప్రభుత్వ ఐటీఐ నందు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇతర వివరాలకు 79813 08986 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలన్నారు.

రోగులకు అందుబాటులో సేవలు



మరుపెంటలో రోగులతో మాట్లాడుతున్న డీఐఓ జగన్‌మోహన్‌రావు

గరుగుబిల్లి: రోగులకు అందుబాటులో సేవలను అందించేందుకు ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డా. టి.జగన్‌మోహన్‌రావు అన్నారు. మండలంలోని మరుపెంటలో గురువారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా శిబిరంలో ఏర్పాటు చేసిన మందులు, వ్యాధి నిర్ధారణ పరికరాలను తనిఖీ చేశారు. రోగుల ఆరోగ్య తనిఖీల వివరాలు, ఓపీ రికార్డులను పరిశీలించి అనారోగ్య సమస్యలు, నిర్ధారణ పరీక్షల వివరాలను పక్కాగా నమోదు చేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో వుంచి వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లల ఆరోగ్య పర్యవేక్షణ రికార్డులను పరిశీలించి బరువు, శారీరక ఎత్తు వయస్సుకు తగ్గట్లుగా ఉన్నదీ లేనిదీ పరిశీలించి నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో డా. ప్రియాంక, సూపర్‌వైజర్ ఉదయకుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భామిని: మండలంలో శుక్రవారం విద్యుత్ కోత విధించనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ బి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఎంఐ పేరున విద్యుత్ లైన్ల జంగిల్ క్లియరెన్స్ చేపట్టనున్నందున శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. కొరమ నుంచి బత్తిలి వరకు జంగిల్ క్లియరెన్స్ చేస్తామని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కలెక్షన్ సెంటర్లతో గిరిజనోత్పత్తులకు గిట్టుబాటు



రేగులగూడ కలెక్షన్ సెంటర్ పరిశీలిస్తున్న ఏడీ రత్నాచార్యులు

సీతంపేట: నాబార్డు ఆర్థిక సాయంతో ఆర్ష్ సంస్థ ఏర్పాటు చేసిన కలెక్షన్ సెంటర్‌లతో గిరిజనోత్పత్తులకు గిట్టుబాటు ధరలు వస్తాయని హార్టీకల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ రత్నాచార్యులు అన్నారు. మండలంలోని గజిలి, పాతరేగులగూడ, సీతంపేట గ్రామాల్లో నిర్మిస్తున్న కలెక్షన్ సెంటర్‌లను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు పండించిన ఉత్పత్తులను ఇక్కడ నిల్వ చేసుకుని మంచి ధరలు వచ్చిన తర్వాత విక్రయించుకోవడానికి వీలవుతుందన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. వ్యాపార కార్యక్రమాలు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా హార్టీకల్చర్ ఆఫీసర్ కెఎస్ఎన్.రెడ్డి, హెచ్‌వో అమరేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రవేశాలు

సీతానగరం: పదోతరగతి పాసైన విద్యార్థులకు రాకపోకల సదుపాయం, మౌలిక వసతులున్న ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రవేశాలు జరుగుతున్నాయని అధ్యాపకులు టి.రవికుమార్, డి.రామకృష్ణ సహచర అధ్యాపకులు మండలంలోని తామరఖండిలో ప్రచారం చేస్తూ టెన్త్ పాసైన విద్యార్థుల నుంచి ప్రవేశ దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ జూనియర్ కాలేజీల్లో విద్యాబోధనకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో జరుగుతోందన్నారు. ఎవరైనా గ్రామాల్లోని విద్యార్థుల తల్లిదండ్రులు విద్యాబోధనను పరిశీలించి వారి పిల్లల్ని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చేర్పించి ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని కోరారు.

ఇక పుట్టేవన్నీ ఆడ దూడలే..

- ఆడ దూడల ఉత్పత్తితోనే పాడి అభివృద్ధి
- పెయ్యి దూడల ఉత్పత్తి పథకంతో రైతుకు ప్రయోజనం
- సబ్సిడీపై ఎస్ఎస్ఎస్ ఇంజక్షన్లు
- పైలట్ ప్రాజెక్టుగా పాలకొండ నియోజకవర్గంలో అమలు



ఎదకు వచ్చిన అవుకు ఇంజక్షన్ చేస్తున్న పశువైద్య సిబ్బంది(ఫైల్)

భామిని: పాడి అభివృద్ధి పెంచేందుకు అనువుగా పెయ్యి దూడల పెంపు పథకం అమలులోకి వచ్చింది. రైతు దొడ్డిలోని ఆవులకు పుట్టిన దూడలన్నీ ఆడ దూడలే పుట్టడానికి అనువుగా సంకరీకరణ సిద్ధం చేశారు. కృత్రిమ గర్భదారణ పద్ధతిలో ఉపయోగించే సాధారణ వీర్యనాళికల ద్వారా మగ, ఆడ దూడలు పుట్టే శాతం సగం, సగంగా ఉంటుంది. పశు పోషణే ముఖ్య జీవనాధారంగా ఉన్న రైతులకు, డైరీ ఫాం నిర్వాహకులకు మగ దూడలు ఎక్కువగా పుట్టడంతో నిర్వహణ భారం పెరుగుతుంది. ఈ సమస్యను పరిష్కరించడానికి లింగ నిర్ధారిత వీర్యం ఉపయోగించడం వల్ల 90 శాతం పైగా ఆడపెయ్యిలు పుట్టి రైతులకు పశుపోషణ మరింత లాభసాటిగా మారనుంది.

ఎస్ఎస్ఎస్ పద్ధతిలో తయారీ

రాష్ట్రీయ గోకుల్ మిషన్ సౌజన్యంతో లింగ నిర్ధారిత వీర్యం (సెక్స్ సార్టెడ్ సీమెన్) ఎస్ఎస్ఎస్ విధానం ద్వారా ఏబీపీపీ సిద్ధం చేస్తుంది. ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖల పర్యవేక్షణలో రైతులకు చేర్చుతున్నారు.

తొమ్మిది నెలల్లో.. తొంబై శాతం ఫలితం

ఆవు ఎదకు వచ్చే సమయంలో ఎస్ఎస్ఎస్ ఇంజక్షన్ రైతు ఇష్టంతో వేస్తారు. రైతు భరోసా కేంద్రాలు, గోపాలమిత్రల ద్వారా రైతులకు చేర్చుతున్నారు. ఈ ఎస్ఎస్ఎస్ విధానంలో ఇంజక్షన్ వేసిన ఆవులకు 99 శాతం ఆడదూడలు పుడతాయి. తొమ్మిది నెలలకు ఆడదూడ జననం సాధ్యపడుతుంది. రైతులకు లాభసాటి పాడి అభివృద్ధిగా మారుతుంది. ఆడ దూడలలో పాడి పెరుగుతుంది. మగ దూడల నిర్వహణ భారం తప్పుతుంది.



పథకంపై రైతులకు వివరిస్తున్న సీతంపేట ఏడీ శ్రీనివాస్

ఆడ దూడ పుట్టక పోతే రైతుకు రాయితీ



ఈ పథకం పైలట్ ప్రాజెక్టుగా పాలకొండ నియోజకవర్గంలో అమలు చేస్తున్నాం. భామిని, సీతంపేట, పాలకొండ, వీరఘట్టాం మండలాల్లో పెయ్యి దూడల పథకం అమలు చేపట్టాం.ఏబీఐపీ ద్వారా లింగ నిర్ధారిత ఇంజక్షన్లు సబ్సిడీపై ఇస్తున్నాం. ఒక్కో ఎస్ఎస్ఎస్ ఇంజక్షన్ రూ.1350 కాగా 650 రూపాయలకే రాయితీపై రైతుకు ఇస్తున్నాం. వెటర్నరీ సిబ్బంది పాడి పశువుకు ఇంజక్షన్ వేస్తారు. ఆడ దూడ పుట్టకపోతే రూ.250 తిరిగి చెల్లిస్తాం. ఎదకు వచ్చిన ఆవుకు 21 రోజుల్లో రెండుసార్లు ఇంజక్షన్ చేయాల్సి ఉంటుంది.

– డాక్టర్ బసవ శ్రీనివాస్, ఏడీ, పశు సంవర్ధక శాఖ, సీతంపేట

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



సాయి ప్రతిమ వద్ద ఎమ్మెల్సీ విక్రాంత్, పలువురు ప్రజాప్రతినిధులు

పాలకొండ రూరల్: నక్కలపేటలోని షిర్డీసాయి మందిరంలో నవగ్రహ విగ్రహ, షిర్డీసాయి ప్రతిమ ప్రతిష్ఠ చేపట్టారు. గత మూడు రోజులుగా జరుగుతున్న ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలను యజ్ఞకర్త శర్మయాజీ నేతృత్వంలో సాంప్రదాయబద్ధంగా చేపడుతున్నారు. వేడుకల్లో గురువారం ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, పలువురు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త పల్లా కొండలరావు పర్యవేక్షణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

తూకాల్లో మోసాలు



మాట్లాడుతున్న గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి లక్ష్మణరావు

సీతంపేట: జీడిపిక్కల కొనుగోలు, తూకాల్లో దళారీ వ్యాపారులు మోసాలకు పాల్పడుతున్నారని గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.లక్ష్మణరావు ఆరోపించారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీడిపప్పు కిలో రూ.700 ధర పలుకుతుంటే జీడిపిక్కలు రూ.87లకు ప్రైవేటు వ్యాపారాలు కొనుగోలు చేసి గిరిజనులను తీవ్రంగా దోపిడి చేస్తున్నారన్నారు. వెలుగు, జీసీసీ ఉన్నా ఫలితం లేకపోయిందన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు పి.సాంబయ్య, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయానికి భూమి పూజ



రామాలయానికి భూమి పూజ చేస్తున్న గ్రామస్తులు

రేగిడి: మండల పరిధిలోని చిన్నకోడిశ గ్రామంలో గురువారం రామాలయ నిర్మాణానికి గ్రామస్తులు భూమిపూజ చేశారు. ఉదయం నుంచి గ్రామస్తులంతా భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు. అందరి సహకారంతో రామాలయాన్ని నిర్మించుకునేందుకు ముందుకు రావడం గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

లోకోస్ యాప్‌పై శిక్షణ

బలిజిపేట: సంఘ సభ్యుల ఆధునీకరణపై మహిళా సంఘాలకు లోకోస్ యాప్‌పై శిక్షణ కార్యక్రమం బలిజిపేటలోని వైఎస్సార్ క్రాంతి పథం మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే శిక్షణలో రెండు రోజులు గ్రామ మహిళా సంఘాలకు శిక్షణ, ఒకరోజు ఫీల్డ్ శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన టీఓటీ గురుమూర్తి వారికి సూచనలు అందించారు. సంఘాల ఆధునీకరణ, కొత్త సంఘాల చేర్పులు, సంఘ సభ్యులు ఎవరైనా మృతి చెందితే వారి తొలగింపు తదితర అంశాలను ఏవిధంగా యాప్‌లో అప్‌లోడ్ చేయాలో వివరించారు. ఎటువంటి పొరపాట్లు లేకుండా సంఘాలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. రెండు రోజుల శిక్షణ అనంతరం గ్రామాల్లో ఫీల్డ్ వర్క్ నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎం ఉమామహేశ్వరరావు, సీసీలు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్ అందజేత



సీఎం సహాయనిధి అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు రూ.2లక్షలను గెడ్డగూడకు చెందిన సవర కృష్ణకు పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి గురువారం అందజేశారు. గత నెల 17న ఆ గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో నోటి క్యాన్సర్‌తో బాధపడుతున్నానని ఆర్థిక సాయం అందజేయాలని బాధితుడు మొర పెట్టుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీనిలో భాగంగా కృష్ణకు చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న లక్ష్మీనృసింహ స్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖి నదీ తీరాన వేంచేసిన లక్ష్మీనృసింహస్వామి గురువారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు పి.శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో అర్చకులు స్వామికి అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక్కడి స్వామివారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని, అలాగే సంతానం లేనివారు స్వామివారికి ముడుపులు చెల్లిస్తే సంతాన ప్రాప్తి కలుగుతుందన్న నమ్మకం భక్తులకు ఉందని అర్చకులు తెలిపారు. దూర ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులందరికీ ఆలయ అర్చకుడు శ్రీనివాసరావు పర్యవేక్షణలో తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

జేవీకే స్టాక్ పాయింట్‌ను పరిశీలన



జగనన్న విద్యాకానుక కిట్లను పరిశీలిస్తున్న ఎంఈవో నాగభూషణరావు

జియ్యమ్మవలస: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న విద్యాకానుక స్టాక్ పాయింట్‌ను మండల విద్యాశాఖాధికారి ఎస్.నాగభూషణరావు గురువారం పరిశీలించారు. మండలానికి ఎన్ని పుస్తకాలు వచ్చాయి, రావలసిన పుస్తకాల వివరాలు తెలుసుకున్నారు. మండలానికి 39,592 పుస్తకాలు అవసరం కాగా 19308 పుస్తకాలు వచ్చినట్లు తెలిపారు. పాఠశాలలు తెరిచే నాటికి పుస్తకాలు పూర్తి స్థాయిలో రానున్నట్లు తెలిపారు. ఎంఐఎస్ కోఆర్డినేటర్ మనోజ్, ఎల్‌డీఏ తిరుమల ఉన్నారు.

హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌కు దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ వారి డ్రైవర్ ట్రైనింగ్ స్కూల్ నుంచి శిక్షణ పొంది హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పొందడానికి గిరిజన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీవో కల్పనాకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థి విధిగా లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్ ఒక సంవత్సరం అనుభవం కలిగి ఉండాలన్నారు. ఎంపిక కమిటీ ద్వారా దరఖాస్తులు పరిశీలన అనంతరం అన్ని రకాల అర్హులైన 16 మందిని హెవీ డ్రైవింగ్ శిక్షణకు పంపించనున్నామన్నారు. శిక్షణ కాలం పూర్తయ్యేంత వరకు అభ్యర్థులకు భోజన, వసతి సౌకర్యాలు, శిక్షణ ఫీజు, లైసెన్సు ఫీజు చెల్లించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 18న ఉదయం 10.30 గంటలకు ఒరిజనల్ సర్టిఫికెట్లతో సీతంపేట ఐటీడీఏలో హాజరు కావాలని కోరారు.

అంటువ్యాధులకు గురికాకుండా చూసుకోవాలి

బలిజిపేట: ప్రజలు అంటువ్యాధులకు గురికాకుండా చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని బలిజిపేట హోలీస్పిరిట్ కేర్ అండ్ సపోర్ట్ సెంటర్ సీహెచ్‌సీ సిస్టర్ జీవా హితవు పలికారు. మండలంలోని చిలకలపల్లి, చెల్లింపేట గ్రామాల్లో అంటువ్యాధులు, వడదెబ్బపై వేతనదారులకు గురువారం అవగాహన కల్పించారు. వేసవిలో పనులకు వెళ్లేవారు వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు తప్పనిసరిగా మంచినీరు, మజ్జిగ వంటి ద్రవపదార్థాలను వినియోగించాలని, అంటువ్యాధులు సోకితే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. అంటువ్యాధులు పక్కనున్న వారికి త్వరగా వ్యాపించే ప్రమాదం ఉన్నందున జాగ్రత్తలు తప్పనిసరి అని స్పష్టం చేశారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి : పీవో



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో కల్పనాకుమారి

సీతంపేట: వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి అన్నారు. ఐటీడీఏలో వైద్యాధికారులతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుక్కకాటు, పాముకాటు బాధితులు ఎక్కువ అవుతున్నారని అటువంటి కేసుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆస్పత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలన్నారు. గర్భిణులు పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండాలన్నారు. చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. దోమల నివారణా మందును గిరిజనుల ఇళ్లల్లో స్ప్రేయింగ్ చేయించుకునేలా చైతన్యం చేయాలన్నారు. డెంగీ కేసులు నమోదైతే తగిన వైద్యం అందించాలని అన్నారు. ఫ్రైడేను డ్రైడేగా పాటించాలన్నారు. క్షేత్ర స్థాయి వైద్య సిబ్బంది నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. వైద్యశాఖ, ఐసీడీఎస్ సమన్వయంతో పనిచేసి లబ్ధిదారులకు సరైన పోషకాహారం అందివ్వాలన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల డీఎంహెచ్‌వోలు మీనాక్షి, జగన్నాథరావు, సీడీపీవోలు, వైద్యాధికారులు, మలేరియా నివారణా సిబ్బంది పాల్గొన్నారు.

హద్దు రాళ్ల ఏర్పాటులో నిర్లక్ష్యం వద్దు

- సబ్ కలెక్టర్ నూరుల్ కమర్



బెజ్జి గ్రామంలో సర్వే రాళ్లు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

పాలకొండ: సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యంగా ఉండవద్దని సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ సూచించారు. మండలంలోని బెజ్జి, వాటపాగు, మల్లివీడు గ్రామాల్లో జరుగుతున్న హద్దు రాళ్ల ఏర్పాటును గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. ముందుగా ప్రభుత్వ పోరంబోగు భూములకు హద్దులు వేయాలని తెలిపారు. రైతుల సమక్షంలో వారి పొలాలకు హద్దులు వేయాలని వివరించారు. ఎక్కడా తప్పులు జరగకుండా గ్రామ సర్వేయరులు పని చేయాలన్నారు. మ్యాప్ ఆధారంగా పనులు చేయాలని సూచించారు. ఆయనతో పాటు తహసీల్దార్ పి.సోమేశ్వరరావు, మండల సర్వేయర్ పి.వెంకటరావు ఉన్నారు.

ప్రతీ రైతును వ్యాపారవేత్తగా తీర్చిదిద్దాలి



కోల్డ్ స్టోరేజీ వద్ద ఎఫ్‌పీఓ సభ్యులతో ఉద్యానవన శాఖ అధికారులు

వీరఘట్టం: రైతు ఉత్పత్తిదారుల సంఘంలో సభ్యులుగా ఉన్న ప్రతీ రైతును వ్యాపారవేత్తగా తీర్చిదిద్దాలని విజయవాడ నుండి వచ్చిన అసిస్టెంట్ ఉద్యానవన శాఖ అధికారి రత్నాచార్యులు పేర్కొన్నారు. వీరఘట్టం సమీపంలోని వెంకమ్మ చెరువు సమీపంలో నిర్మిస్తున్న కోల్డ్ స్టోరేజీ, కలెక్షన్ సెంటర్లను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సంఘంలో ఉండే రైతులు పండించిన అన్ని రకాల పంటలను ఇక్కడ నిల్వ చేయడంతో పాటు కొనుగోలు కూడా చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయనతో పాటు పార్వతీపురం అసిస్టెంట్ ఉద్యానవన శాఖ అధికారి రెడ్డి, పాలకొండ హెచ్ఓ అమరేశ్వరి, ఎఫ్‌పీఓ అధ్యక్షుడు గొర్లె బలరాం నాయుడు, ఏపీఎం శివున్నాయుడు, సీసీ ఆనందరావు, రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కథల పోటీలు



విద్యార్థులు వేసిన చిత్రాలు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు గురువారం పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ మేరకు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు కథల పోటీలు, డ్రాయింగ్ తదితర పోటీలను నిర్వహించారు. శిక్షణ శిబిరంలో భాగంగా ప్రతీ రోజు విద్యార్థులకు పోటీలను నిర్వహించడంతో పాటు మహనీయుల జీవిత విశేషాలను వివరించడం జరుగుతుందని శాఖా గ్రంథాలయ నిర్వాహకులు మధుసూధనరావు తెలిపారు.

గృహ నిర్మాణాల లక్ష్యాలను పూర్తి చేయాలి

- ఎంపీపీ ఉరిటి రామారావు



మాట్లాడుతున్న ఎంపీపీ రామారావు

గరుగుబిల్లి:

పక్కా గృహాల నిర్మాణాల లక్ష్యాలను అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని ఎంపీపీ ఉరిటి రామారావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. మండలానికి మంజూరైన 1400 గృహాల నిర్మాణాలను ప్రారంభించేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గృహ నిర్మాణాలను సకాలంలో పూర్తి చేసేందుకు అవసరమైన ప్రణాళికలు చేయాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఇళ్ల నిర్మాణాలలో పురోగతి తీసుకురావాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ జి.పైడితల్లి, ఏఈ వి.అఖిల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్నవరంలో 'విద్యా పంచాయతీ'



విద్యార్థులతో ముచ్చటిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్‌కమర్

పాలకొండ రూరల్: పిల్లల విద్యా ప్రమాణాల రోజువారీ మెరుగుదలపై తల్లితండ్రుల పర్యవేక్షణ కీలక భూమిక పోషిస్తుందని పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్‌కమర్ అన్నారు. మండంలోని అన్నవరం గ్రామంలో 'విద్యా పంచాయతీ' అనే సరికొత్త కార్యక్రమానికి గురువారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా అక్కడి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు, వారి తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, స్థానిక విద్యాధికులతో సమావేశమయ్యారు. పాఠశాల విద్యార్థుల నోట్, వర్కు బుక్స్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఉపాధ్యాయుల పనితీరుపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. నెలలో ఒకసారి ఇటువంటి పంచాయతీలు స్థానిక పెద్దలు, ప్రజాప్రతినిధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గవర రాజశేఖర్, వైస్ ఎంపీపీ వాకముడి అనిల్‌కుమార్, ఎంఈవో ఎం.సూర్యనారాయణ, విద్యా కమిటీ చైర్మన్ కె.అమ్మాజి, జి.ప్రసాదరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

పాలకొండ: స్థానిక పోలీసుస్టేషన్ పరిధిలో గురువారం ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహరించారు. ఎస్ఐ శివప్రసాద్ ఆధ్వర్యంలో వీరఘట్టం సెంటర్, ఏలాం సెంటర్‌లతో పాటు ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో వాహనాలు తనిఖీ చేసి అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.


సచివాలయాల్లో 'స్పందన' తప్పనిసరి



బుక్కూరు సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ గోపాలకృష్ణ

పాలకొండ: గ్రామ సచివాలయాల్లో ప్రతీ రోజు మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు క్రమం తప్పకుండా స్పందన నిర్వహించాలని డీఎల్‌డీఓ వి.గోపాలకృష్ణ అన్నారు. మండలంలోని బుక్కూరు సచివాలయాన్ని ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్పందనలో వచ్చిన వినతుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. సచివాలయం పరిధిలో ఆ సమస్యలు పరిష్కరించలేకపోతే ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు.

కోతకు రబీ వరి సిద్ధం



కాట్రగడ సమీపంలో కోత దశలో రబీ వరి పొలాలు

భామిని: మండలంలోని రబీ వరి పంట కోతలకు సిద్ధంగా ఉందని మండల వ్యవసాయాధికారి కె.సింహాచలం గురువారం తెలిపారు. ఇప్పటికే మండలంలోని 283 ఎకరాల్లో రబీ వరి పంట నమోదు జరిగిందన్నారు. 16 రైతు భరోసా కేంద్రాల పరిధిలో 4 ఆర్బీకేలలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదించామన్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో అకాల వర్షాల కారణంగా వరి పంటలో పచ్చదనం కొనసాగుతూ పండడానికి ఆలస్యమైందన్నారు. ఆర్బీకేలకు రైతు ధాన్యం కొనుగోలుకు ఇండెంట్ వస్తే తక్షణమే కొనుగోలు చేపటడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.